సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



యలవర్రులో మహిళలకు కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

యలవర్రు(వేమూరు): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి వ్యక్తికి లబ్ధి చేకూరిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మంత్రి నాగార్జున ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహా సంకల్ప యాత్ర నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా.. యలవర్రు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ద్వారా తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మహిళలను కోలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత మహిళలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండే నాగేశ్వరరావు, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జడ్పీటీసీ మూల్పూరు లావణ్య, ఎంపీటీసీ షారిన్, ఒలేటి శివాజీ, పి.ప్రేమయ్య, కె.జయంతిరావు, మానుకొండ శాస్త్రీ, ఎంపీటీసీ మానుకొండ ఝాన్సీ, మానుకొండ నాయుడమ్మ, అమర్తలూరు వెంకయ్య, గ్రామ సర్పంచ్‌లు కొండ పల్లి కిరణ్, దేవరకొండ రాము, లాం బోసుబాబు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజారంజక పరిపాలన

కర్లపాలెం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో ప్రజా రంజక పరిపాలన అందిస్తున్నారని నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్ర నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు కర్లపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఎస్‌కే ఆసిఫ్ అలీ, నాయకులు మందపాటి పరమానంద కుమార్, దొంతిరెడ్డి శివారెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

వేమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తయ్యి నాలుగేళ్లు కావడంతో మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు వేమూరు బస్టాండ్ సెంటరులో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోగంటి లవ కుమార్, గుమ్మడి దానియేలు, చిలకా సురేష్, వేమూరి షారాబంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేతల నివాళి

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

నిజాంపట్నం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రేపల్లె రూరల్ సీఐ శివ శంకర్ హెచ్చరించారు. నిజాంపట్నం మండలంలోని అడవులదీవి గ్రామ శివారులో కోడి పందేల స్థావరంలో సోమవారం పోలీసులు దాడులు చేశారు. పందేలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని, కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్ వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు..అడవుల దీవిలో కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకొని, రెండు కోళ్లను, రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కోడి పందేలు, పేకాట వంటి జూదాలకు పాల్పడితే ఎంతటివారైనా సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. అడవుల దీవి, నిజాంపట్నం, నగరం ఎస్ఐలు రవి, రమేష్, రామకృష్ణ, నవీన్, పోలీస్ సిబ్బంది సమావేశంలో ఉన్నారు.

కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం తగదు

రేపల్లె రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు లీజుల పేరుతో తాకట్టు పెడుతున్నట్లు మండిపడ్డారు. బీజేపీ విధానాలతో పేద ప్రజలు రోజు గడవక ఇబ్బంది పడుతున్నారని, ప్రైవేటీకరణతో ఉద్యోగాలు కోల్పోయి నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ తన విధానాలను మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, సీపీఎం నేతలు డి.శ్రీనివాసరావు, ఆగస్టీన్, యు.రామకృష్ణ, ఎస్.శివశంకర్, నవీన్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ రాముని పట్టాభిషేకం

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లిలోని శ్రీ రామ నామక్షేత్రంలో సోమవారం శ్రీ రాముని పట్టాభిషేకం వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాలను కూరపాటి సుధాకర శాస్త్రి శాస్త్రయుక్తంగా జరిపించారు. సప్త రుషులు స్వామివారి పాదుకలకు అభిషేకం చేశారు. ఉదయం శ్రీ పట్టాభిరామునికి నగరోత్సవం గావించారు. బాల త్రిపుర సుందరి మహిళా సమాజం ఆర్గనైజర్ అల్లం వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో శ్రీ ఆంజనేయ సహస్ర నామ స్తోత్రం, స్తుతులు, గేయాలు ఆలపించారు. మచిలీపట్నంకు చెందిన మడమల రాంబాబు భాగవతార్ హరికథ కాలక్షేపం జరిగింది. కుందేటి శ్రీనివాసరావు, నాగజ్యోతి దంపతులు ఆంజనేయ స్వామి వారికి ఆకు పూజ చేశారు. పూజా కార్యక్రమాల్లో డొక్కు నాగాంజనేయులు, శివ చంటి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కాగిత దుర్గా ప్రసాదరావు, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు పర్యవేక్షించారు.

మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

కర్లపాలెం: మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు పేర్కొన్నారు. కర్లపాలెం వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీడీవో పాల్గొని, మాట్లాడారు. మహిళల అభివృద్ధే ధ్యేయంగా సీఎం ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీఎహెచ్ ధనలక్ష్మి, కార్యదర్శి నాగలక్ష్మి, ట్రెజరర్ ఎస్‌కే నసీమా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, సీహెచ్‌వో మీరమ్మ, ఏఈవో భాగ్యలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో ఆక్రమణలను నిలువరించండి

కొల్లూరు: కృష్ణా నదిలోని బుసక మేటలో చెట్లు నరికి, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని నిలువరించి, నదీ తీరాన్ని పరిరక్షించాలని రైతులు కొల్లూరు తహసీల్దార్‌కు విన్నవించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందనలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పెదలంక అరవింద వారధి వెంబడి ఉన్న బుసక మేటలో కొందరు చెట్లు నరికి, భూమి చదును చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన బుసక మేటల్లో స్థానిక రైతులు మొక్కలు పెంచి, నదీ తీర ప్రాంతంలోని భూములు కోతకు గురికాకుండా కాపాడుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. నదిలో కొద్దిపాటి నీరు విడుదల చేసినా తీరం వెంబడి వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నట్లు తెలిపారు. నది మధ్యలో ఉన్న పది లంక గ్రామాలకూ ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్రమణలను అడ్డుకోవాలని ఇప్పటికే పోలీసులకు అదేశాలు జారీచేశామని, ఈ భూముల్లో ఎటువంటి కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని రైతులకు తహసీల్దారు హామీ ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ దాసరి శ్యాంసుధాకర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆరుంబాక, చెరుకుపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

బాపట్లటౌన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఈఈ జీవీఎల్ఎన్ మూర్తి హెచ్చరించారు. బాపట్ల పట్టణంలో సోమవారం విద్యుత్ శాఖాధికారులు 48 బృందాలుగా ఏర్పడి 3442 మీటర్లను ఆకస్మికగా తనిఖీ చేశారు. దాడుల్లో 81 మంది అదనపు లోడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ. 6.33లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. గృహోపకరణాలకు కనెక్షన్ తీసుకొని వాణిజ్య సముదాయాలకు వినియోగిస్తున్న నలుగురికి రూ.15 వేలు అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ జి.ఆంజనేయులు, డీఈ ఆంజనేయులు, ఏఈ పెరుగు శ్రీనివాసరావు, విజిలెన్స్ డీఈ సురేంద్రబాబు పాల్గొన్నారు.

వాహనాలకు వేలం నేడు

నగరం: మద్యం, నాటు సారా అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన కారు, ద్విచక్ర వాహనాలకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని ఎస్ఈబీ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. టాటా ఇండికా కారు, మరో 44 ద్విచక్ర వాహనాలకు వేలం జరపనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.2వేలు డిపాజిట్ చేయాలన్నారు.

'స్పందన'తో సమస్యలు పరిష్కారం

రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మూడు అర్జీలు అందాయని ఆయన తెలిపారు. కుమారుడు పోషణ చూడటంలేదని, కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పెనుమూడి గ్రామానికి చెందిన 60 ఎస్టీ కుటుంబాలకు నివేసన స్థలాలు మంజూరు చేయాలని, న్యాయవాద భృతి ఇప్పించాలని అర్జీలు అందినట్లు చెప్పారు. ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు.

'స్పందన'కు రెండు అర్జీలు

చెరుకుపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి సోమవారం రెండు అర్జీలు అందాయని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. కనగాల గ్రామానికి చెందిన దూపం బసవ మల్లయ్య అనే వ్యక్తి తన స్థలం అన్యాక్రాంతమైందని, సర్వే నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. నడింపల్లి గ్రామానికి చెందిన ఇందిర అనే దివ్యాంగురాలు గత నెల నుంచి పింఛన్ రావడంలేదని మరో అర్జీ సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన 'బంగారం'

పిట్టలవానిపాలెం: అలకాపురం గ్రామం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి విద్యార్థి దుండి రిష్యంత్ రెడ్డి జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించాడని ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. డిసెంబరు 24, 25 తేదీల్లో ఒంగోలులో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో రిష్యంత్ పాల్గొని, బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, పీఎంసీఎస్ చైర్‌పర్సన్ మండే విజయ్‌కుమార్.. కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావును, విద్యార్థిని శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సమ్మెట నాగబాబు, ఉపాధ్యాయులు ఎనుముల వెంకటేశ్వర రావు, గ్రామపెద్దలు ఉన్నారు.

18 నుంచి సీఐటీయూ అఖిల భారత మహా సభలు

బాపట్లఅర్బన్: ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు సీఐటీయూ అఖిల భారత మహా సభలు నిర్వహించడం జరుగుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. 17వ మహా సభల్లో భాగంగా సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీహెచ్ మజుందార్ మాట్లాడుతూ బెంగళూరులో సభలు జరుగుతున్నాయని తెలిపారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి బి.తిరుమల రెడ్డి, ఎస్.కోటేశ్వరరావు భాస్కరరావు, పి.బుచ్చిరాజు పాల్గొన్నారు.

'భూ రక్ష' పథకంపై అవగాహన కల్పించాలి

రేపల్లె: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ పేర్కొన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కరపత్రాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. అధికారులు కరపత్రాలను పట్టణంలో ఇంటింటికీ అందజేసి ప్రచారం చేయాలని కోరారు. వైస్ చైర్మన్‌లు గుజ్జర్ల మూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

బాపట్లఅర్బన్: విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరులో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ ఆటల పోటీల్లో బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతులు సాధించారు. సోమవారం బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను ఆయన అభినందించారు. సొసైటీ సెక్రటరీ మనం నాగేశ్వరరావు, ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

బాపట్లఅర్బన్: చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో సోమవారం అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ వై.రాధ, కళాశాల అధ్యాపకులు సీహెచ్ వీవీ సత్యనారాయణ, సోమేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎస్టీలకు గృహాలు నిర్మించాలి

కర్లపాలెం: జగనన్న కాలనీల్లో ఎస్టీలకు ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వాలని ఏపీ గిరిజన యానాది సేవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకసిరి నరసింహారావు డిమాండ్ చేశారు. సోమవారం కర్లపాలెంలో గిరిజనులతో నరసింహారావు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ యానాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు.

వివేకానంద పురస్కారానికి రామచంద్రరరావు ఎంపిక

భట్టిప్రోలు: చెరుకుపల్లి మండలం కావూరు జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు గోలి రామచంద్రరరావు 'వివేకానంద పురస్కారం-2023'కి ఎంపికయ్యారు. వివేకానంద విద్యా, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేయడం జరుగుతుందని సంస్థ అధ్యక్షుడు, ఎస్ఎస్ఎఫ్ భాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు సోమవారం తెలిపారు. రామచంద్రరావు తెలుగు, సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. 2019లో ఉత్తమ కవిగా జాతీయ పురస్కారం, అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పత్రికల్లో అనేక వ్యాసాలు రచిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.